# ప్రేమ

-ఎస్. మోహనహరి

పెంచలయ్యా వాళ్ళమ్మ కడుపులో ఉండగానే తండ్రిని కోల్పోయాడు. కొంచెం కొంచెం జ్ఞానం వచ్చేటప్పటికి వాళ్ళమ్మ అతణ్ణి ఒక మూల కూర్చోబెట్టి కల్లు డిపోలో ఎంగిలి సీసాలు కడుగుతుంటే చూశాడు.

మట్టిలో బొర్లాడేవాడు. ఆడుకునేవాడు. ఏడ్చేవాడు. అన్నీ అక్కడే!!

పని పూర్తయ్యాక తల్లితో ఇంటికొచ్చేటప్పుడు మిగతా పిల్లలు బంతులతో ఆడుకుంటూంటే చూశాడు. రంగు రంగు బొమ్మలతో ఆడుకుంటుంటే చూశాడు.

అమ్మని అడగాలనుకున్నాడు. అసలు అమ్మతనతో మాట్లాడితేగా! పని పూర్తయ్యాక అక్కడే రెండుముంతల కల్లు తాగి ఇంటికి వచ్చాక పొద్దున్న వండిన అన్నంలో చింత పులుసు వేసి తనకు తినిపించి తనూ తినేది. ఆ తర్వాత వెంటనే గుడిసె ముందు చాపేసుకుని పడుకునేది.

పలుకరిస్తే పలకరించనంత మత్తులో ఉండేది!!

పెంచలయ్య నిద్రొచ్చే దాకా చుక్కల్ని చూస్తూ లెఖ్ఖ పెట్టేవాడు. మరో ప్రక్కన మేడమీద అల్లరి చేస్తున్న గొప్పింటి పిల్లల్ని చూసేవాడు.

వాళ్ళలా తనెందుకు లేడు!

పైసలు!

పైసలుంటే వాళ్ళకంటే మంచిగా ఉండొచ్చని వాడి చిన్నారి మనసులో పడిపోయింది.

పెంచలయ్యకి పదిహేనేళ్ళు వచ్చేనాటికి పైసలమీద ఆశ ఎక్కువైంది. తన తల్లిదగ్గర ఏముందీ? గంజి మెతుకులు, అంతే. అంతకంటే ఏమీ లేదని వాడి మనసుకి తట్టింది. కాని డబ్బుకంటే ముఖ్యమైనది ఆమె దగ్గర ఉందని అతనప్పుడు తెలుసుకోలేకపోయాడు.

పైసలు రావాలంటే పట్నం వెళ్ళాలని అనుకున్నాడు. అదే మాట అమ్మ బువ్వ తింటుంటే చెప్పేశాడు.

తల్లి తల్లడిల్లిపోయింది. ''వద్దుబిడ్డా! నువ్వు ఎళ్ళిపోతే నాకెవరు దిక్కు? ఆ పట్నంలో ఏముంది? నేను పన్జేసే దగ్గర నీకు పనిప్పిస్తా. ఇంకెక్కడికి పోవద్దు.'' అని పదే పదే నచ్చజెప్పింది.

పెంచలయ్య తల్లి మాటని ఖాతరు చెయ్యలేదు.

యాభైమైళ్ళు నడిచి పట్నం చేరుకున్నాడు.

పట్నంలో కార్లు చూశాడు. మనుషులు వేసుకున్న రకరకాల బట్టల్ని చూశాడు. అట్లా తనూ అవ్వాలనుకున్నాడు.

తిరిగి తిరిగి హోల్‌సేల్ బియ్యం దుకాణంలో కెళ్ళి పని కోసం అడిగాడు. కౌంటర్‌మీద కూర్చున్న సేటు పెంచలయ్యని బాగా చూశాడు. కొన్ని ప్రశ్నలు వేశాడు. చివరికి తృప్తి కలిగి అతనికి పనిచ్చేశాడు.

లారీలలో వచ్చిన బియ్యం, చక్కెర, పప్పుబస్తాలను దించీ షాపులోకి చేర్చాలి. మళ్ళీ ఎవరైనా గిరాకీ వస్తే ఆ బస్తాలను దించి వాటిని తరాజు ముందుంచాలి.

అదేవాడు రోజూ చేసే పని.

అదిగో. అప్పటినుంచీ పెంచలయ్య అక్కడే పని చేస్తున్నాడు.

కనీసం ముప్పై యేళ్ళు గడిపేశాడు.

వాడిమీద సేటుకి నమ్మకం కుదిరింది. సమయం వచ్చినప్పుడు మూటలు మోస్తున్నాడు. సేటు లేనప్పుడు కౌంటర్ మీద కూర్చుంటున్నాడు.

సగం కడుపుని కట్టుకుని డబ్బుని సేటు చెప్పిన పోస్టాఫీసులో ఖాతా తెరిచాడు. అన్నేళ్ళ నుంచీ పెంచలయ్యకి తెలిసింది ఒక్కటే. పని చెయ్యాలి. కొంచెం తినాలి. బాగా పైసలు కూడబెట్టాలి. అది తప్ప అతనికి మరేమీ తెలీదు.

మనిషి కేవలం డబ్బేకాదు. కాస్తంత ప్రేమ, అనుబంధం ఉండాలని వాడికెప్పుడూ తోచలేదు. వాడి దృష్టిలో ప్రేమ ఒక పిచ్చి! అంతే.

ఒక బాలింతరాలు పసిబిడ్డని పొత్తిళ్ళలో వేసుకుని హడావిడిగా హాస్పిటల్ వైపు వెళుతుంటే వెకిలిగా నవ్వుకున్నాడు. ''అంత గాబరా పడటం దండగ!'' అనుకున్నాడు.

మనుషులకే కాదు. పక్షులక్కూడా ఆ ప్రేమ జబ్బు ఉందని గమనించాడు.

ఒక పిల్లపిచ్చుక నేలమీద పడిపోతే తల్లి పిచ్చుక తెగ అరుస్తోంది. మగ పిచ్చుక కరెంటు తీగల మీద కూర్చుని అటూ ఇటూ తోకని తిప్పుతూ అరుస్తోంది. తల్లి పిచ్చుక పిల్ల పిచ్చుకని నోట కరుచుకుని గూట్లోకి తీసుకెళ్ళింది. కాస్సేపయ్యాక ఎక్కడికో వెళ్ళి వచ్చింది. అప్పుడు దాని నోట్లో పురుగుంది. ఆ పురుగుని పొడిచి పొడిచి ముక్కలు చేసి పిల్ల పిచ్చుక నోట్లో వేస్తుంది.

ఆ దృశ్యం చూసి పెంచలయ్య తల విదిలించాడు.

అతనికి ఒక్కటే ధ్యాస!

పైసలు కూడ బెట్టాలి!

ఏనాటికైనా తనొక సేటైపోవాలి. అంతే.

గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయంతో డబ్బులు కూడబెట్టాడు. ఆ ముప్ఫైయేళ్ళల్లో కూడబెట్టిన డబ్బులు పదివేలు!

పదివేలతో పది రకాల బియ్యం బస్తాలు కూడా రావు!

అందుకని మనసు చంపుకుని ఒక్కపూట మానేసి ఇంకా ఎక్కువ డబ్బులు కూడబెడుతున్నాడు.

పెంచలయ్య మనసు అట్లాగే ఉంది గానీ బలమైన ఆహారం లేక వయసు తెచ్చిన మార్పులు కాస్త ముందరే వచ్చేశాయి.

మునుపటిలా అవలీలగా బస్తాలు ఎత్తలేకపోతున్నాడు.

కూర్చుంటే, లేస్తుంటే మోకాళ్ళ నొప్పులు మొదలయ్యాయి.

అతనికి వయసు మళ్ళిందని అతనికే తెలీదు!

అట్లాంటి పెంచలయ్య మీద మస్తాన్ షేక్ కన్నుపడింది. వాడి నిజాయితీ అతనికెంతో నచ్చింది. అతని బలహీనత తనకు పనికొస్తున్నందుకు చాలా సంతోషించాడు.

''పెంచలయ్యా! నువ్విప్పుడు సంపాదించిన దానికంటే రెండింతలు జీతం నేనిస్తాను. యీ వయసులో ఇంకేం బస్తాలు మోస్తావు చెప్పు. మేము దుబాయ్‌కి వెళ్తున్నాము.

**అతను తెగించి గోడని రెండు చేతులతో పట్టుకుని ఎగిరాడు. చేతుల బలం మీద గోడ కానుకుని చూశాడు. చెట్లు కనిపిస్తున్నాయి. కానీ చేతులు వణుకుతున్నాయ్. కాళ్ళకి పట్టు దొరకటం లేదు. మోచేతులు గీరుకుపోతున్నాయి. అప్పుడే లోపల్నుంచి ''ఎవడ్రా అది?'' అని అరుపు వినిపించింది.**

నువ్వు మా బంగ్లాని, చెట్లని కనిపెట్టుకునుంటే చాలు'' అన్నాడు.

పెంచలయ్య మొహంలో ఆశ నాట్యమాడింది. డబ్బు కోసం అన్నేళ్ళు పనిచేసిన సేటు ఆశ్రమం వదిలేశాడు. మస్తానోషేక్ బంగ్లాలోనికి వచ్చేశాడు.

వారం రోజులు మస్తానోషేక్ దగ్గర చెయ్యాల్సిన పనులన్నీ తెలుసుకున్నాడు.

మస్తానోషేక్ భార్యాపిల్లలతో బాటూ వాళ్ళ పర్మనెంట్ పనివాణ్ని కూడా తీసుకుని వెళ్ళిపోయాడు.

పెంచలయ్యకి ఆనందంగా ఉంది.

ఇంతకాలం తను షాపు వరండాలో గోనెసంచి వేసుకుని చలిలో వణుకుతూ, వానలో తడుస్తూ పడుకునేవాడు.

ఇప్పుడట్లాకాదు.

పెద్దబంగళా. ఆ బంగళాలో మెత్తని పరుపు, కప్పుకు నేందుకు పాత రజాయి. అన్నీ ఉన్నాయి.

మూడు నెలల్లో పెంచలయ్య బాగానే మారిపోయాడు. కాస్త ఒళ్ళు వచ్చింది. శరీరం నునుపెక్కింది. ముఖంలో కళొచ్చింది.

పెంచలయ్య పని దొంగకాడు. రెండుపూటలా ఊడ్చి శుభ్రం చేస్తున్నాడు, పూల చెట్లకి, పళ్ళచెట్లకీ నీళ్ళు పోస్తున్నాడు.

గులాబీ చెట్లు! మల్లెచెట్లు!

జాం చెట్లు! సపోటా చెట్లు!

నీలి కనకాంబరాల చెట్లు!

బొండుమల్లె చెట్లు!

అన్నింటికి శ్రద్ధగా నీళ్ళు పోస్తున్నాడు.

సమయానికి నీళ్ళు పోస్తుంటే చెట్లు నిగనిగలాడుతున్నాయ్. పువ్వులు పూస్తున్నాయి. రకరకాల పళ్ళు కాస్తున్నాయ్.

గడుసు పిల్లకాయలు పండ్లు దొంగతనంగా తెంచుతుంటే బెదిరిస్తున్నాడు గట్టిగా అరుస్తున్నాడు.

ప్రతిరోజూ ఒక పిచ్చిది మాత్రం వస్తోంది.

పళ్ళు కావాలని, పువ్వులు కావాలని మారాం చేస్తుంది. పెంచలయ్య కర్రతో ఆమెని బెదిరిస్తున్నాడు.

తను నీరు పోసిన చెట్లకి పువ్వులు పూస్తే పెంచలయ్య ముచ్చట పడ్డాడు. తను నీరు పోసిన చెట్లకి పళ్ళు కాస్తే సంబరపడ్డాడు.


'దొరవస్తే వాటిని చూసి సంతోషిస్తాడు' అనుకున్నాడు.

అనుకున్నట్టే ఒక రోజు పెళ్ళాం పిల్లలతో దొర వచ్చేశాడు.

సంతోషంతో చెట్లని చూపించాడు. వాటికి పూచిన పువ్వుల్ని చూపించాడు. గుత్తులుగుత్తులుగా కాసిన పండ్లు తెంచీ పిల్లలకు ఇచ్చాడు.

మెచ్చుకుంటాడని అనుకున్నాడు. ''చూడూ, వయసు మళ్ళింది. ఇక నీకెందుకుకీ పని? మా పనోడు చూసుకుంటాడు. ఇదిగో. యీ వెయ్యి రూపాయలు తీసుకో. మీ వూరెళ్ళి రెస్టు తీసుకో. నీ మంచి కోసమే చెబుతున్నా.'' అతనట్లా అంటూంటే పెంచలయ్యకి నోరు పడిపోయినట్లయింది.

అతను మౌనంగా ఏడ్చాడు.



మౌనంగానే బ్రతిమిలాడాడు.

మౌనంగానే చెట్ల వైపు పిచ్చిగా చూశాడు.

''వాటికి దూరం అవుతున్నాను.'' అనేమాట అతను తట్టుకోలేకపోతున్నాడు. ''ఎందుకు తనకేమౌతోంది'' అని ఆలోచిస్తున్నాడు.

''ఇదిగో.ఇదే.ఇదే ప్రేమంటే..'' అంటోంది మనసు.

అంతకాలం తను ఒక పిచ్చిదాన్ని కసురుకుని వెళ్ళగొట్టాడు. ఇప్పుడు కసురుకోకుండా తియ్యగా తన యజమాని తనని వెళ్ళగొడ్తున్నాడు.

మౌనంగా గేటు బయటకు వచ్చేశాడు పెంచలయ్య.

తనెక్కడికి పోవాలి? మళ్ళీ బియ్యం షాపులోకెళితే!? అలవాటు తప్పింది. ఒక చిన్న పూల తొట్టె ఎత్తితే ఆయాసం వస్తోంది. ఇహ ఆ బస్తాలేం మోస్తాడు తను?

''చేయలేని పని దగ్గరకు వెళ్ళి చెడ్డపేరు తెచ్చుకోకూడదు'' అనుకున్నాడు.

ఇప్పుడు తన దగ్గర డబ్బుంది. పోస్టాఫీసులో దాచుకున్న డబ్బుంది. కానీ ఎందుకో మనసు సంతోషంగా లేదు.

చెట్లమీద మనసు పీకుతోంది.

వాటిని చూడాలనే కోరిక గుండుసూదిలా గుండెల్ని గుచ్చుతోంది.

మెల్లిగా గేటు తెరచుకుని వెళ్ళబోయాడు.

''చల్ చల్..జావో..ఇదరమత్ ఆనా....'' అంటూ మెడపట్టి గెంటినట్టు అరిచాడు పర్మనెంటు పనిమనిషి.

పెంచలయ్యకి పిచ్చెక్కినట్లుంది.

చెట్లని చూడాలి. కరువుదీరా చూడాలి.

ఎట్లా? ఎట్లా?? ఎట్లా???

ఒక ఆలోచన వచ్చిందతనికి.

మెల్లిగా ప్రహరీ గోడదగ్గరకెళ్ళాడు. ఏడడుగుల గోడ!!

ఎగిరి చూడాలని ఎగిరాడు. చెట్లు కనిపించలేదు గానీ

మోకాళ్ళు మాత్రం కలుక్కుమన్నాయి.

అట్లా కాదనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు.

పెద్ద బండరాయి కనిపించింది. అతి కష్టంగా దాన్ని ఎత్తి గోడ దగ్గర పెట్టాడు. దాని మీదెక్కి చూశాడు. ఇంకా ఎత్తుంటే గానీ చూడ లేడు.

మడమలెత్తి చూశాడు. ఇంకొంచెం ఎత్తుకావాలి!

పెంచలయ్యకి ఏమీ తోచటం లేదు. ఒక్కటే ధ్యాస. చెట్లని చూడాలి. చెట్లకున్న పువ్వుల్ని చూడాలి. పండ్లని చూడాలి.

అతను తెగించి గోడని రెండు చేతులతో పట్టుకుని ఎగిరాడు. చేతుల బలం మీద గోడ కానుకుని చూశాడు. చెట్లు కనిపిస్తున్నాయి. కానీ చేతులు వణుకుతున్నాయ్. కాళ్ళకి పట్టు దొరకటం లేదు. మోచేతులు గీరుకుపోతున్నాయి.

అప్పుడే లోపల్నుంచి "ఎవ్డ్రా అది?" అని అరుపు వినిపించింది.

పెంచలయ్య బెదిరిపోయాడు. ఆ భయంలో పట్టుతప్పి క్రింద పడిపోయాడు. తల రాయితో బలంగా కొట్టుకుంది. రక్తం కారుతోంది. మోచేతులూ, మోకాళ్ళూ గీరుకుపోయి తెగ మంట పుడుతోంది.

లేవలేని పరిస్థితిలో అతను అట్లాగే కళ్ళుమూసుకున్నాడు. బాధతో మూలిగాడు.

ఎవరో వచ్చారు! తన తలని వాళ్ళ తొడమీద పెట్టుకుంటున్నారు. కారుతున్న రక్తాన్ని మెల్లిగా తుడుస్తున్నారు. ఆ స్పర్శ! ఆ స్పర్శలో ఏదో మాయ ఉంది! ఆ స్పర్శలో ప్రేమ ఉంది! ఆప్యాయత ఉంది!!

తన జేబులో వెయ్యి రూపాయలున్నాయ్.

అవి తనకెలాంటి ప్రేమని ఇవ్వలేకపోతున్నాయ్.

తనది కాని స్పర్శ తన గుండె ఏడుపుని ఓదారుస్తోంది!!

బయటకు తన్నుకొచ్చిన దుఃఖంతో పసివాడిలా ఏడ్చేశాడు. కళ్ళు తెరచి చూశాడు.

పిచ్చిది!


తన తలని ఒళ్ళో పెట్టుకుని నవ్వుతూంది. లాలిస్తోంది. గాయాన్ని తుడుస్తోంది.

పెంచలయ్య లేచి కూర్చున్నాడు. పిచ్చిదాని కాళ్ళు పట్టుకుని భళ్ళున ఏడ్చేశాడు.

"అమ్మా! అమ్మా! తప్పయిందే. నిన్ను వదిలి వచ్చేసినందుకు నిజంగా ఏడుస్తున్నానే. తప్పయి పోయిందమ్మా!"

పిచ్చిదాని కాళ్ళకు మొక్కి లేచి నిలబడ్డాడు.

మోకాళ్ళలో నెప్పి! మోచేతుల్లో మంట!




పెంచలయ్య నడుస్తున్నాడు. తన ఊరికి చేరే దాకా నడుస్తున్నాడు.

ఊరు చేరేసరికి రాత్రి ఎనిమిదయింది.

ఊరు మారిపోయింది. ఊర్లోని మనుషులు మారిపోయారు. పొలాలు పోయి మిద్దెలు కనిపిస్తున్నాయి.

తన గుడిసెక్కడుందో గుర్తుకి తెచ్చుకున్నాడు. ఆ వైపు నడుస్తున్నాడు.

తనూహించిన స్థానంలో గుడిసెలేదు. పెంకుటిల్లు ఉంది.

గుడిసెలేదు! అమ్మలేదు!!

పెంచలయ్యకి భయం వేసింది.

దారిలో పోతున్న వాళ్ళని పట్టుకుని "మా అమ్మ ఏదీ? మా అమ్మ ఏదీ? మా అమ్మ ఎక్కడుందో మీకు తెలుసా?" అని అడుగుతూంటే వాళ్ళు తప్పించుకుని వెళ్ళిపోతున్నారు.

"ఎవడో పిచ్చోడు!" అనుకుంటున్నారందరూ.

పెంచలయ్య మళ్ళీ ఆ పెంకుటిల్లు దగ్గరకు వచ్చాడు.

ఇంటి తలుపులు కొట్టాడు. ఇంట్లో ఎవ్వరూ లేనట్లుంది. లోపల దీపం వెలగటం లేదు. అయినా కొట్టిన తలుపులు కొడ్తూనే ఉన్నాడు.

పక్కింటివాళ్ళూ, ఎదురింటి వాళ్ళు వచ్చి తిడుతున్నారు. అతణ్ణి పిచ్చోడనుకుని.

"అయ్యా! నేను ఫలాన మనిషిని. మా అమ్మ ఎక్కడుందో చెప్పండి. మీ కాల్మొక్కుతా.." అంటున్నాడు. బొట బొట కన్నీళ్ళు కారుస్తున్నాడు.

అయినా అక్కడున్న వాళ్ళు "పాపం పిచ్చోడు.." అనుకుని జాలి చూపిస్తున్నారు.

అప్పుడొచ్చింది ఒక ముసలావిడ! ఎవరో తన మీద జాలి పడి వచ్చింది! చీకట్లో ఆమె మొహం కనిపించటం లేదు.

ఆమెని పెంచలయ్య గుర్తుపెట్టలేకపోయాడు. కాని, ఆమె మాత్రం అతణ్ని గుర్తు పట్టేసింది.

అతని చేయి పట్టుకుంది.

"నా బిడ్డ వచ్చిండు. నా బిడ్డ వచ్చిండు.." అని అరిచింది.

పెంచలయ్య ఏడుపుఆగిపోయింది. అతను ఆమెవైపు దీక్షగా చూశాడు.

రా బిడ్డా! ఇది మనఇల్లే. నీకోసం కట్టినా, నువ్వు ఎప్పటికైనా వస్తావని నాకు తెలుసురా. అందుకే నీకోసం ఇల్లు కట్టినా" ఆమె తలుపులకి వేసిన తాళం తెరుస్తూ అంది.

సంతోషంతో ఆమె చేతులు వణుకుతున్నాయ్. అతికష్టంగా చీకట్లో వెదికివెదికి అగ్గిపెట్టెను తీసుకుని దీపం పెట్టింది.

వెలిగిన దీపం వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కనిపిస్తోంది పెంచలయ్యకి. ఆమె వైపు బాగా చూశాడు. ఇంకా బాగా చూశాడు. చూస్తూ చూస్తూ అమాంతంగా ఆమె కాళ్ళమీద పడిపోయాడు.

కాళ్ళదగ్గరున్న బిడ్డకోసం ఆమె క్రిందికి వంగింది. పెంచలయ్య వెంటనే ఆమె భుజాలు పట్టుకుని తన వడిలోకి తీసుకున్నాడు.

ఆమె వణుకుతున్న చేతులతో అతని బుగ్గలను నిమిరింది. జుట్టు సవరించింది.

ఆ స్పర్శ!! ఆ స్పర్శలో అనిర్వచనీయమైన ఆనందం కల్గుతూందతనికి! అతని జేబులోని పోస్టాఫీసు పాస్ బుక్కూ, వెయ్యి రూపాయల రొక్కం రెండూ కలిసి ఆ ఆనందాన్ని ఇవ్వలేకపోతున్నాయి.

ప్రేమంటే ఏమిటో అప్పుడర్థమైంది పెంచలయ్యకి.

★

## సినిమాలకు గుడ్‌బై?



'జెంటిల్‌మాన్' చిత్రం ద్వారా తెరకి పరిచయమై ఆనక అనేక తెలుగు, తమిళ చిత్రాల్లో నాయికగా నటించిన శుభశ్రీ, మాలాశ్రీకి చెల్లెలే అనే సంగతి తెలిసిందే! అక్కలాగే శుభశ్రీ కూడా జీవితంలో సెటిలైపోయిందిప్పుడు. నీరజ్ అనే యువకుడ్ని ప్రేమించి, ఇన్నాళ్ళకి పెళ్లి చేసుకున్న శుభశ్రీ తన భర్త గార్మెంట్స్ బిజినెస్ చేస్తుంటారని చెప్పింది. ఎంతో కాలంగా తాము ప్రేమించుకుంటున్నట్టు ఇన్నాళ్ళకి పెళ్లి చేసేసుకుంటున్నట్టు చెప్పిన శుభశ్రీ ఇకమీదట సినిమాల్లో నటించకూడదనే అనుకుంటున్నట్టు చెబుతోంది. సరే, ఈమాట మీద ఆమె ఎంతకాలం వుంటుందో చూద్దాం! గతంలో పెళ్లి చేసుకున్నాక సినిమాలకు గుడ్‌బై అన్న తారలు ఎంతోమంది తిరిగి సినిమాల్లో నటించడం మనం చూడలేదా?

-జె.ఎం.